తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

07-09-2026

సోమవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 210

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575





## కాంగ్రెస్ 1,000 రోజుల పాలన

# అట్టర్‌ఫ్లాప్

- థర్డ్ క్లాస్ పరిపాలన సాగుతోంది
- త్వరలో ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్
- ప్రాజెక్టుల వైఫల్యాలపై కాంగ్రెస్‌ను ఎండగడతా
- లక్ష మందితో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల సందర్శన
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్‌ఎస్‌ఎల్పీకి దిశానిర్దేశం

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో థర్డ్ క్లాస్ పరిపాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతానని పార్టీ నేతలకు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్ అసెంబ్లీ వ్యూహంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.


మిగతా 2వ పేజీలో..




# చిన్న బాస్ ఆదేశం!

- ఒక్కరోజులోనే 3600 మెగావాట్ల విద్యుత్ ఫిసిబిలిటీ అనుమతి లభ్యం!
- సామాన్యుడికి మాత్రం యేండ్లు పట్టే పని..
- ఆగమేఘాలమీద ఇచ్చేసిన వైనం!
- ట్రాన్స్కో ఉద్యోగుల నోటికిaa తాళం ఆదేశాల వెనక అసలు కారణం ఇదేనా?
- ఒక్కొక్కటిగా వెలుగులోకి ట్రాన్స్కో లీలలు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

:విద్యుత్ శాఖలో సామాన్యుడికి ఒక్క దరఖాస్తు పరిష్కారం కావాలంటే పైరవీకారుల వల్లే కొన్ని నెలలు పడుతుంది. ఇక నేరుగా దరఖాస్తు చేస్తే ఎన్నేళ్లు a తెలియని పరిస్థితి. అలాంటిది తెలంగాణ ట్రాన్స్మిషన్ కంపెనీ ఒక్కరోజులో 3600 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం చేసిన దరఖాస్తులను ఒకే వేదికలో అధికారులంతా కూర్చొని సంతకాలు చేసి మరి అనుమతులు ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. టీజీ ట్రాన్స్కో లో ఇటీవల ఉద్యోగుల నోటికి తాళం వేసేందుకు ఇచ్చిన ఉత్తర్వుల వెనక అసలు కారణం ఇలాంటి రహస్య ఉత్తర్వులు వెలుగులోకి రాకుండా చూసేందుకేనని అర్థమవుతోంది. తెలంగాణలోని ఏదైనా ప్రదేశంలో 5 మెగావాట్లకు పైగా విద్యుత్ సరఫరా అవసరం ఉంటే తెలంగాణ ట్రాన్స్కో అందుకు కావాల్సిన ఫిసిబిలిటీ ఇవ్వాలి. ఇందుకోసం వచ్చిన దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే ట్రాన్స్కో లో కనీసం మూడునెలలైనా పడుతుంది. అదికూడా అధికారులను ప్రభావితం చేయగలిగే రాజకీయ వత్తిడి లేదా అధికారులను మెప్పించగలిగే పైరవీ ఉంటే తప్ప సాధ్యం కాదు. కానీ ఇటీవల డేటా కేర్ సెంటర్ ఏర్పాటు కోసం వచ్చిన కొన్ని దరఖాస్తుల్లో రెండు సంస్థలకు మాత్రమే ఒక్క రోజులో ఫిసిబిలిటీ ఇవ్వడం వెనక ఓ చిన్న బాస్ హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఫోర్త్ సిటీ కేంద్రంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.


మిగతా 2వ పేజీలో..


## అసెంబ్లీలో కాంగ్రెస్ వైఫల్యాలను

# ఎండగడతాం

- నెల రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం కేసీఆర్‌కు అసెంబ్లీలో గౌరవం దక్కడం లేదు సాగునీటి ప్రాజెక్టులపై భారీ కార్యాచరణ సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం
- మాజీ మంత్రి హరీష్ రావు




2


## తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై

# ప్రభుత్వం సీరియస్




2


- మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశాలు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు విచారణ
- ఫోరెన్సిక్, టెక్నికల్ ఆధారాల సేకరణ వేగవంతం
- పకడ్బందీగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశం
- బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ప్రభుత్వం

## బాసరలో రూ.20 కోట్లతో ఘాట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

- గోదారమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- భక్తుల సౌకర్యాల కోసం ఘాట్ల అభివృద్ధి




2


## ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం




2


- పెళ్లి పేరుతో మోసం చేశాడని ఈశ్వర్ సాయిపై ఆరోపణలు
- పోలీసులు న్యాయం చేయడం లేదంటూ ఆవేదన
- ఈశ్వర్ సాయి భార్యపై మరో ఫిర్యాదు
- ఏఐ వీడియోల వైరల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- ట్రోలింగ్ చేస్తున్న యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

## బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం

# అప్పుల ఊబిలోకి




2


- రూ.6.70 లక్షల కోట్ల అప్పులు చేశారన్న మహేష్ గౌడ్
- కాళేశ్వరం, మిషన్ భగీరథపై తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారంటీలను వరుసగా అమలు చేస్తున్నాం

## కొండా సురేఖపై చర్యలు.. ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం

- సురేఖ కుమార్తె వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి
- క్రమశిక్షణ విషయంలో ఎలాంటి వివక్ష లేదు


2


## ఉద్యోగ సంఘాలతో భట్టి చర్చలు విఫలం




3


- ఆందోళనలు విరమించాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి
- స్పష్టమైన హామీ రాలేదన్న ఉద్యోగ సంఘాలు
- 10న 'చలో హైదరాబాద్' యథావిధిగా
- ఉద్యమ కార్యాచరణపై రేపు మరోసారి భేటీ
- తదుపరి పోరాటంపై ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయం
- మల్లు భట్టి విక్రమార్క

## మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి


3


ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

## తెలంగాణను ఫోటోనిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- అధునాతన సాంకేతికతల్లో రాష్ట్రాన్ని కీలక కేంద్రంగా అభివృద్ధి
- సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌కు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్
- సెమీకండక్టర్ మిషన్–2.0తో అనుసంధానంపై చర్చ
- పరిశోధన నుంచి వాణిజ్య తయారీ వరకు ఎకోసిస్టమ్
- క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంలో భాగస్వామ్యానికి ఆహ్వానం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబ




3

# బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి

- **అప్పులు, ఆస్తులపై బహిరంగ చర్చకు సిద్ధం**
- **బీఆర్ఎస్ నేతలకు పీసీసీ అధ్యక్షుడి సవాల్**
- **మహేష్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 6:
తెలంగాణ ఆర్థిక పరిస్థితి, గత పదేళ్ల పాలనలో చేసిన అప్పులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదిరింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సృష్టించిన ఆస్తులు, చేసిన అప్పులపై చర్చించేందుకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

**పదేళ్లలో రూ.6.70 లక్షల కోట్ల అప్పులు**

స్వతంత్ర భారతంలో తెలంగాణ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 65 ఏళ్ల కాలంలో చేసిన మొత్తం అప్పు కేవలం రూ.68 వేల కోట్లు మాత్రమేనని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అయితే గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్ర అప్పులు ఏకంగా రూ.6.70 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు. కేవలం పదేళ్లలోనే భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆయన విమర్శించారు.

**కాళేశ్వరం, మిషన్ భగీరథపై విమర్శలు**

లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుల పాలనకు నిదర్శనంగా నిలిచిందని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల పేరుతో వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. ఆయా పథకాల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

**ఆరు గ్యారంటీల అమలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే పేదలకు అండగా నిలుస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వరుసగా అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో మార్పుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఆరోగ్య రంగాన్ని ఆధునీకరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన కళ్యాణ లక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కులను లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామని వివరించారు.

**బహిరంగ చర్చకు సిద్ధమా?**

గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటితో సృష్టించిన ఆస్తుల వివరాలపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలకు ధైర్యముంటే శ్వేతపత్రంతో సహా ప్రత్యక్ష చర్చకు రావాలని సవాల్ విసిరారు. అప్పులు, ఆస్తులపై ప్రజల ముందు వాస్తవాలను తేల్చుకుందామని అన్నారు.

# కొండా సురేఖపై చర్యలు.. ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం

- **పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు**
- **వ్యక్తిగతంగా రాజీనామా కోరలేదు**
- **కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం**
- **మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6:**
కొండా సురేఖ మంత్రివర్గ తొలగింపు వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఎన్టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ట, క్రమశిక్షణకే కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం పూర్తిగా ఏఐసీసీ పరిధిలోనే జరిగిందని వెల్లడించారు.

**సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అసంతృప్తి**

కొండా సురేఖ కుమార్తె చేసిన కొన్ని ఆరోపణలు, వ్యాఖ్యలు పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తీవ్ర ఇబ్బందికరంగా మారాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వ్యవహారంపై వెంటనే స్పందించి సరైన వివరణ ఇవ్వాలని సురేఖను కోరినప్పటికీ.. ఆమె నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని చెప్పారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు పార్టీ అంతర్గత అంశాలు, విమర్శలను బహిరంగంగా ప్రస్తావించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

**క్రమశిక్షణలో వివక్ష లేదు**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ అమలులో కుల, మత, ప్రాంతీయ వివక్షకు తావులేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి నాయకులైనా చర్యలు ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పారు.
గతంలో జి. చిన్నారెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి వంటి పలువురు నేతలపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

**ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదనే స్పష్టమైన సంకేతాన్ని ఈ చర్య ద్వారా ఏఐసీసీ ఇచ్చిందని పేర్కొన్నారు.

**వ్యక్తిగతంగా రాజీనామా కోరలేదు**

కొండా సురేఖను వ్యక్తిగతంగా ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలించి సమర్పించిన నివేదిక, సిఫార్సుల ఆధారంగానే ఏఐసీసీ చర్యలు తీసుకుందని తెలిపారు. కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఆమె వ్యవహరించే తీరును బట్టి తదుపరి నిర్ణయాలు ఉంటాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై ప్రభుత్వం సీరియస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 6:**

నగర పరిధిలోని తుక్కుగూడలో సంచలనం సృష్టించిన నర్సు హత్యాచార ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ కోసం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**పకడ్బందీగా దర్యాప్తు**

కేసు దర్యాప్తును అత్యంత పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సాంకేతిక ఆధారాల సేకరణతో పాటు ఇతర దర్యాప్తు ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు.

**సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు**

కేసును పోలీసులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ పకడ్బందీగా సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

**బాధిత కుటుంబానికి అండగా**

ఈ దుర్ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా దర్యాప్తు, న్యాయ ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# చిన్న బాస్ ఆదేశం!

**డేటా సెంటర్ ఇప్పుడు పెద్ద బిజినెస్!**

హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు డేటా సెంటర్ల అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది.ఫ్యూచర్ సిటీ పరిధిలో ఇప్పటికే 1500 ఎకరాల్లో డేటా సెంటర్ ఏర్పాటు కోసం టీజీఐఐసి భూములు సైతం కేటాయించింది. ఒక డేటా సెంటర్ ఏర్పాటు చేయాలంటే అందుకు ప్రధానంగా నీరు,విద్యుత్ సరఫరా అవసరం.ఇక్కడ అలాంటి డేటా సెంటర్ ల ఏర్పాటు కోసం పలు సంస్థలు దరకాస్తు చేసాయి. ఐతే ఇందులో రెండు సంస్థలకు మాత్రమే అతి తక్కువ కాలంలో ఫిసిబిలిటీ ఇవ్వడం వెనక చిన్న బాస్ ఉన్నట్టు తెలుస్తోంది.

**ఒక్కరోజులో ఫిసిబిలిటీ సాధ్యమా?**

తెలంగాణ ట్రాన్స్కో లో అధికారులు వచ్చే ధరఖాస్తులు చూడటానికే నెలలు పడుతుంది. కేవలం 5 మెగావాట్ల లోడ్ కోసం దరఖాస్తు చేసినా లెక్కలేని కొర్రీలు పెడతారు. అలాంటిది ఒక్కరోజులో ఆ రెండు కంపెనీలకు ఏకంగా 3600 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అవకాశం ఉందంటూ ఫిసిబిలిటీ ఇచ్చేసారు. అయితే ఆ రెండు కంపెనీలు ఎవరివి?వారు చిన్న బాస్ బినామీలేనా అన్న చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ విద్యుత్ శాఖలో అన్ని తానై నడిపిస్తున్న ఆ చిన్న బాస్ వత్తిడికి తలొగ్గి అసలు ఏమాత్రం ప్రాథమిక విచారణ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వడం,అదే సమయంలో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ధరఖాస్తులకు మోక్షం లభించకపోవడం పై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గి ఏకంగా ఒక సంస్థకు 2000 మెగావాట్లు, మరొక సంస్థకు 1600 మెగావాట్లు ఇవ్వడం వెనక ఉన్న అసలు నిజం ఏంటన్నది ట్రాన్స్కో అధికారులు చెప్పాల్సిందే. అందుకేనేమో ఎవ్వరితో మాట్లాడొద్దు. కాంటీన్లో మాట్లాడినా కారిడార్లలో మాట్లాడినా కఠిన చర్యలు తప్పవంటు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఇది కేవలం ఒక్క ఉదాహరణ మాత్రమే ఇలాంటి ఎన్నో లోగుట్టుల రహస్యాన్ని నిర్బంధంతో బయటపడకుండా చూడాలని ట్రాన్స్కో ప్రయత్నిస్తోందని అర్థమవుతోంది.

# కాంగ్రెస్ 1,000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్

**ప్రజల అజెండానే పార్టీ అజెండా**

సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని కేసీఆర్ నేతలకు వివరించారు. ఉభయ సభల్లో జరిగే ప్రతి చర్చలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. ప్రజల సమస్యలనే పార్టీ అజెండాగా మార్చుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. స్పీకర్ పక్షపాత వైఖరి అవలంబిస్తే సభలోనే ఎండగట్టాలని, ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నల వర్షం కురిపించాలని దిశానిర్దేశం చేశారు.

**సంక్షేమంపై నిలదీయాలి**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేసీఆర్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలు, రైతు భరోసా, రుణమాఫీ అమలులో జాప్యంతో పాటు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీ అమలుపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విఫలమై ప్రతిపక్షాలపై నిందలు వేస్తున్నారని కేసీఆర్ మండిపడినట్లు సమాచారం.



**ప్రాజెక్టులపై క్షేత్రస్థాయిలో పోరు**

కేసీఆర్ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో చేస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన అనంతరం లక్ష మందితో కలిసి కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల వద్దకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు వెల్లడించారు.

**ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం**

తనను రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడం కాదని, తాను ప్రజాక్షేత్రంలోకి వచ్చిన తర్వాత వారు ఏం మాట్లాడతారో చూద్దామని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆ పార్టీ నేతలకే అర్థమైందని, అందుకే రాష్ట్రంలో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించిన కేసీఆర్.. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు బయట ప్రజల మధ్యకు వెళ్లి పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది.

# అసెంబ్లీలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:**
ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని ఆరోపించిన ఆయన.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

**నెల రోజుల పాటు సమావేశాలు**

అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజుల పాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) లో డిమాండ్ చేస్తామని హరీశ్‌రావు తెలిపారు. సభలో తమకు మాట్లాడేందుకు తగిన సమయం, అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరుతామని చెప్పారు. ప్రతిపక్షానికి సముచిత ప్రాధాన్యం ఇవ్వకుండా వ్యవహరిస్తే ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. 22ఏ అంశంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు అన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని వ్యాఖ్యానించారు.

**కేసీఆర్‌కు గౌరవం దక్కడం లేదు**

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు అసెంబ్లీలో తగిన గౌరవం ఇవ్వడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్న పరిస్థితుల్లో కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా అభిప్రాయపడ్డామని తెలిపారు. గతంలో జయలలిత, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు వంటి నేతలు కూడా గౌరవం లభించని సందర్భాల్లో అసెంబ్లీకి దూరంగా ఉన్న విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఇదే సమయంలో సీఎం కుటుంబ సభ్యులకు భద్రత కల్పించే విషయంలోనూ ప్రశ్నలు సంధించారు. వార్డు మెంబర్‌గా కూడా లేని వ్యక్తికి గన్‌మెన్లను ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులను ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు.

**సాగునీటి ప్రాజెక్టులపై భారీ కార్యాచరణ**

సాగునీటి ప్రాజెక్టుల అంశంలో బీఆర్ఎస్ భారీ కార్యాచరణకు సిద్ధమవుతోందని హరీశ్‌రావు తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షలాది మందితో కలిసి కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నారని వెల్లడించారు.

**స్పీకర్‌పై అవిశ్వాసానికి వెనుకాడం**

సభలో తమకు తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా వెనకాడబోమని హరీశ్‌రావు హెచ్చరించారు. దీంతో రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

# ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

**మాదాపూర్, సెప్టెంబర్ 6:**
తెలంగాణ జానపద నృత్య కళాకారుల వర్గంలో కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు న్యాయం జరగడం లేదనే మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి ప్రయత్నించగా.. కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించి గది తలుపులు పగలగొట్టి ఆమెను కాపాడినట్లు వెల్లడించారు.



**పెళ్లి పేరుతో మోసం చేశాడని ఆరోపణ**

జానపద పాటల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈశ్వర్ సాయి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మాధురి గతంలో ఆరోపించారు. వీరిద్దరూ ఒకే గదిలో ఉన్న సమయంలో ఈశ్వర్ సాయి భార్య వారిని పట్టుకున్న ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. ఈ ఘటనపై ఈశ్వర్ సాయి తనపై వచ్చిన ఆరోపణలను ఖండించగా.. మాధురి మాత్రం తనకు జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించారు.

**పోలీసుల తీరుపై అసంతృప్తి**

తనకు న్యాయం చేయాలని, ఈశ్వర్ సాయిపై చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సరిగా స్పందించలేదని మాధురి ఆరోపిస్తున్నారు. ఈశ్వర్ సాయికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతున్నప్పటికీ ఫలితం లేకపోవడం, కేసు విచారణలో జాప్యం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మాధురి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**ఏఐ వీడియోలపై మరో ఫిర్యాదు**

ఇదిలా ఉండగా.. సామాజిక మాధ్యమాల్లో తనపై ఏఐ ద్వారా రూపొందించిన వీడియోలను వైరల్ చేస్తున్నారంటూ మాధురి రాథోడ్ నార్సింగి పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. తన మొబైల్‌ను దొంగిలించిన ఈశ్వర్ సాయి భార్య తనకు సంబంధించిన పోస్టులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. వీడియోలను తనకు ట్యాగ్ చేస్తూ పరువుకు భంగం కలిగిస్తున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ట్రోలింగ్ చేస్తున్న యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్**

మాధురి ఆత్మహత్యాయత్నానికి పోలీసుల నిర్లక్ష్య వైఖరే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పెళ్లి పేరుతో మోసం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈశ్వర్ సాయిపై చర్యలు తీసుకుని, మాధురికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తాజా ఫిర్యాదులపై పోలీసులు ఎలా స్పందిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆర్ పదవికి న్యాయం చేయాలి..

- **లేక రాజీనామా చేయాలి..!**
- **ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే ప్రతిపక్ష నేత హోదా ఎందుకు?**
- **70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం**
- **రెండేళ్లలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు**
- **మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే**
- **మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6:**
ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలని.. లేదంటే అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ఆయన ఆ పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించాయి.

**అధికారం శాశ్వతం కాదు**

అధికారం అనేది ప్రజలు ఇచ్చే కానుక అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పదవులు శాశ్వతం కావనే స్పృహతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల పక్షాన పనిచేస్తున్నామని తెలిపారు. ఇల్లు లేని అర్హులందరికీ ఇళ్లు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

**ఉద్యోగాలు, పెట్టుబడులే లక్ష్యం**

గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసి ఆ తర్వాత మొహం చాటేశారని మహేష్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరో రెండున్నరేళ్లలో మరింత మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా రెండేళ్లలో రూ.1.78 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు సాధించామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామని వివరించారు.

**గద్దర్‌కు ప్రత్యేక గౌరవం**

గత ప్రభుత్వం ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీలను పూర్తిగా విస్మరించిందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ పేరిట ప్రత్యేక అవార్డులు ఏర్పాటు చేసిందని తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి వారికి తగిన గౌరవం కల్పించామని గుర్తుచేశారు.

**కేసీఆర్, బీఆర్ఎస్ తీరుపై విమర్శలు**

బీఆర్ఎస్ హయాంలో వైద్య రంగం పూర్తిగా కార్పొరేట్ రంగం చేతికి చిక్కిందని మహేష్ గౌడ్ ఆరోపించారు. కేటీఆర్ చదువు గురించి మాట్లాడటం బాగానే ఉన్నా.. ప్రజాపాలన ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు ప్రతినెలా జీతం తీసుకుంటూ ప్రజా సమస్యలపై చర్చించే అసెంబ్లీకి రాకుండా మొహం చాటేయడం ప్రతిపక్ష నేత హోదాను అపహాస్యం చేయడమేనని దుయ్యబట్టారు. బీజేపీ నేతలు వ్యంగ్యంగా మాట్లాడటం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు.

**మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం**

ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే వాటిని సరిదిద్దుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు.

# కాంగ్రెస్‌లో మరో నలుగురికి షోకాజ్ నోటీసులు

- కంది శ్రీనివాస్‌కు క్రమశిక్షణ కమిటీ నోటీసులు
- ఆదిలాబాద్ నేతల మధ్య ఆధిపత్యపోరుపై ఆగ్రహం
- జూపల్లి, సచిన్ సావంత్ సమక్షంలో వాగ్వాదం
- గజ్వేల్ నేతలు నర్సారెడ్డి, మల్లారెడ్డికి నోటీసులు
- వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో నలుగురు నేతలకు పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్‌కు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలపై నోటీసులు ఇచ్చింది.

**ఆదిలాబాద్‌లో ఆధిపత్యపోరు**

ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, కంది శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఇటీవల ఉట్నూరులో జరిగిన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఇద్దరు నేతల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశానికి ఆహ్వానం లేకపోయినా సంజీవరెడ్డి హాజరయ్యారంటూ కంది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలోనే ఇద్దరు నేతలు ఒకరినొకరు దూషించుకున్నట్లు సమాచారం.

**ఇద్దరికీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు**

ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ కంది శ్రీనివాస్, సంజీవరెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీకి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడంపై నేతల నుంచి వివరణ కోరింది.

**గజ్వేల్ నేతలకూ నోటీసులు**

మరోవైపు గజ్వేల్‌కు చెందిన నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి కూడా క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. నర్సారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లారెడ్డి పీసీసీకి ఫిర్యాదు చేయడంతో ఇద్దరికీ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

**వారం రోజుల్లో సమాధానం**

నోటీసులు అందుకున్న నేతలు వారం రోజుల్లోగా తమ వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. ఇప్పటికే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో తాజాగా మరికొందరు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ కావడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం కఠినంగా వ్యవహరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

# ఉద్యోగ సంఘాలతో భట్టి చర్చలు విఫలం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లు, ఆందోళనల నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాల నేతలు జరిపిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి.

ఉద్యోగుల సమస్యలు, వివిధ డిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆందోళనలను విరమించాలని భట్టి విక్రమార్క

ఉద్యోగ సంఘాల ప్రతినిధులను కోరారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. దీంతో ఆందోళనలను విరమించేది లేదని స్పష్టం చేశారు.

**'చలో హైదరాబాద్' కొనసాగింపు**

నెల 10న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు.

**రేపు మరోసారి భేటీ**

భవిష్యత్తులో అనుసరించాల్సిన కార్యాచరణపై ఉద్యోగ సంఘాల జేఏసీ రేపు ఉదయం మరోసారి సమావేశం కానుంది. తదుపరి ఉద్యమ కార్యాచరణ, పోరాట పంథాపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు జేఏసీ వెల్లడించింది.

# నీళ్ల కోసం పాదయాత్ర చేస్తా..!

- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల వద్దకు కేసీఆర్
- లక్ష మందితో కలిసి ప్రాజెక్టుల సందర్శన
- సాగునీటి సంక్షోభంపై ప్రజల్లోకి బీఆర్ఎస్
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం
- ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని కేసీఆర్ పిలుపు



ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం కీలకంగా మారింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించారు. త్వరలోనే కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను స్వయంగా సందర్శించనున్నట్లు ప్రకటించారు.

**లక్ష మందితో ప్రాజెక్టుల సందర్శన**

కేవలం పార్టీ నేతలతో కాకుండా ఏకంగా లక్ష మందితో కలిసి రెండు ప్రాజెక్టులను సందర్శిస్తానని కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టుల పరిస్థితిని ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

**నీళ్ల కోసం భారీ పాదయాత్ర**

రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు త్వరలోనే భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. "నీళ్ల కోసం పాదయాత్ర చేస్తా" అని పేర్కొంటూ సాగునీటి సమస్యపై ప్రజా ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**అసెంబ్లీపై ప్రత్యేక దృష్టి**

రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

**ప్రజాక్షేత్రంలో ఉద్యమ కార్యాచరణ**

అసెంబ్లీ సమావేశాలతో పాటు ప్రజాక్షేత్రంలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను తీవ్రతరం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం.

# బాసరలో రూ.20 కోట్లతో ఘాట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



- విస్తృత స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

నిర్మల్, సెప్టెంబర్ 6, :

గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసరలో చేపట్టనున్న ఘాట్ల నిర్మాణ, పునరుద్ధరణ పనులకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పుష్కరాల సమయంలో వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్నారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గోదారమ్మకు జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగమయ్యారు. గోదావరి పుష్కరాలు తెలంగాణకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక వేడుకలలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు బాసరకు వచ్చే అవకాశముండటంతో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఘాట్ల అభివృద్ధితో పాటు ఇతర మౌలిక సదుపాయాల విస్తరణ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పాత ఘాట్ల పునరుద్ధరణతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు సులభంగా స్నానాలు ఆచరించేలా, రద్దీని సమర్థంగా నియంత్రించేలా ఆధునిక ప్రమాణాలతో ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రవాణా, వైద్య సేవలు, విశ్రాంతి కేంద్రాలు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. బాసరలో పుష్కర భక్తుల రద్దీకి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల అనంతరం కూడా ఈ సదుపాయాలు యాత్రికులకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. బాసర క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన అన్ని వసతులను కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. బాసరను పుష్కరాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.





# తెలంగాణను ఫోటోనిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కోప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం సచివాలయంలో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్‌తో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించడంపై ప్రధానంగా చర్చించారు.



**సిలికాన్ ఫోటోనిక్స్‌పై దృష్టి**

ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణతో పాటు తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌ను ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0తో అనుసంధానించే అవకాశాలను సమీక్షించారు. రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

**డిజైన్ నుంచి తయారీ వరకు..**

డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, పరీక్షలు, సరఫరా వ్యవస్థలను పరస్పరం అనుసంధానించేలా కార్యాచరణ రూపొందించడంపై చర్చించారు. పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మార్చేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

**క్వాంటం కంప్యూటింగ్ కేంద్రానికి ఆహ్వానం**

నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా. వీకే సారస్వత్‌ను ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై ఏర్పాటు చేయనున్న అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కోరారు.

**సహకరిస్తానన్న సారస్వత్**

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా. వీకే సారస్వత్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈ అండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి

- ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రజలకు సౌకర్యంగా నెలవారీ, రోజువారీ పాస్‌ల జారీకి ఆదేశాలు
- పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు వేగవంతం చేయాలని సూచన
- బేగంపేట్ మెట్రో భవన్‌లో సమన్వయ సమావేశం
- మెట్రోలో ప్రయాణించి సౌకర్యాల పరిశీలన




హైదరాబాద్, సెప్టెంబర్ 6,:

హైదరాబాద్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ సంయుక్త ప్రయాణ పాస్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, మెట్రో వాటర్‌వర్క్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రజలకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెలవారీ, రోజువారీ ఉమ్మడి పాస్‌లను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ తదితరులు మెట్రో మొదటి, రెండో దశల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాన కార్యదర్శికి వివరించారు. నగర రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. మెట్రో విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై జరుగుతున్న పనుల పురోగతిని కూడా వెల్లడించారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో కారిడార్ పనుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఆరా తీశారు. 7.5 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత పాతబస్తీ మెట్రో విస్తరణకు సంబంధించిన రోడ్ల విస్తరణ, టెండర్ ప్రక్రియ, జనరల్ కన్సల్టెంట్ నియామకంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కీలక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదేశించారు. మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ అమలుపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు తమ సాంకేతిక సన్నద్ధత గురించి వివరించారు. ఉమ్మడి పాస్ అమలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎప్పుడైనా అమలు చేయగలమని అధికారులు ప్రధాన కార్యదర్శికి తెలిపారు. దీనిపై స్పందించిన సంజయ్ జాజు, ఉమ్మడి చార్జీల విధానాన్ని త్వరగా ఖరారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సమావేశానికి హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ కె. అశోక్ రెడ్డి, మెట్రో రైల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, సీఎస్‌టీఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జీఎం (ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి శాఖల మధ్య సమన్వయం పెంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సమావేశం అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రో స్టేషన్లలోని వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించి మరింత అభివృద్ధి చేయాల్సిన అంశాలపై సూచనలు చేశారు. అలాగే ఎన్‌హెచ్ 44పై హెచ్ఎండీఏ నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులతో పురోగతిపై చర్చించారు. నగర రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు.





# ఘనంగా వేణుమాధవ్ జన్మదిన వేడుకలు.




**సదాశివపేట.సెప్టెంబర్ 6. (సిరిన్యూస్)**

హైదరాబాద్ లోని బంజారాహిల్స్ తెలంగాణ రక్షణ సేన జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ నెమలికొండ వేణుమాధవ్ జన్మదిన వేడుకలు బంజారాహిల్స్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కవిత సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేణుమాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నెమలికొండ వేణుమాధవ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. వేణుమాధవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిరంతరం క్షేమంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

వేణుమాధవ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ శుభాకాంక్షలు తెలిపిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, రవిచంద్ర, అర్చన సేనాపతి, ఇస్మాయిల్, నవీనచారి, ప్రసాద్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ నాయక్, విశాల్, పరమేశ్వర్, సురేష్, బెస్త రాము తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**సదాశివపేట.సెప్టెంబర్ 6. (సిరిన్యూస్)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలముందు ఇచ్చిన హామీల్లో 1000రోజులు అయినా సందర్భంగా మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమలలో బాగంగా ఇశ్రీతాబాద్ గ్రామంలో మాజీ గ్రామ సర్పంచ్ కోడూరి రాములు ఆధ్వర్యంలో జరిగినటువంటి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలకు చేసిందేమి లేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు చేపట్టారు అని కొనియాడారు. వ్యవసాయరాంగానికి పెద్దపిట వేసి పల్లెల అభివృద్ధి కోసం, త్రాగునిరు, గ్రామ పరిశుద్యం, మహిళల అభివృద్ధి, విషయంలో వెనుకంజ వేయలేదన్నారు. ఇంటింటికి గ్యారంటీ కార్డులు, పంచుతూ చీపురుతో రోడ్లు ఊడ్చి నిరసనతెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు బాబుమియా, రాహుఫ్, మోబిన్, రఫీ, సమాద్, షఫీ, మసూద్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# తిరుగులేని విజయం...



- **కృష్ణ బృందావన్ కాలనీ పీఠం ప్రవీణ్ రెడ్డి ప్యానెల్ దే**

**అమీన్పూర్ సెప్టెంబర్ 06 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని కృష్ణ బృందావన్ కాలనీ అసోసియన్ ఎన్నికల్లో ప్రవీణ్ రెడ్డి ప్యానెల్ ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. మొత్తం 307 ఓట్లు పోలవగా, ప్రవీణ్ రెడ్డి ప్యానెల్ కు 180 ఓట్లు లభించాయి, ప్రత్యర్థి ప్యానల్ పై 53 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శరత్, కోశాధికారిగా త్రినాథ్ బాబు, జాయింట్ సెక్రటరీగా యోగేందర్ రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేవంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ... కాలనీవాసులకు కృతజ్ఞతలు తమ ప్యానెల్ను నమ్మి భారీ మెజార్టీతో గెలిపించిన కృష్ణ బృందావన్ కాలనీ నివాసులకు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. అభివృద్ధే ధ్యేయం కాలనీలో ఉన్న డ్రైనేజీ సిసి రోడ్లు వీధి దీపాలు మరి తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వంజరి కుల సంఘం అభివృద్ధికి తనవంతు కృషి





- **రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు ఎదగని వెంకటేశం**

**రామాయంపేట, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్)**

వంజరి కుల సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆ సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్నేహశీలి అవార్డు గ్రహీత ఎదగని వెంకటేశం అన్నారు. ఆదివారం రామాయంపేట పట్టణ వంజరి సంఘం కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు నవాత్ శ్రీనివాస్ అధ్యక్షతన వెంకటేశంకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు కుల సంఘం అభివృద్ధికి కృషి చేసిన వై. వెంకటేశంకు స్నేహశీలి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను వంజరి సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. నిరుపేదలకు ప్రభుత్వం, రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు విద్యను అందించేందుకు స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తున్నామని, వితంతు మహిళలకు సంఘం ద్వారా పెన్షన్ సౌకర్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వంజరి కుల సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి స్నేహశీలి అవార్డు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వంజరి సంగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవాత్ రాజేంద్రప్రసాద్, వంజరి సంఘం పట్టణ అధ్యక్షులు నవాత్ శ్రీనివాస్, వంజరి సంగం నాయకులు నవాత్ నాగేశ్వర్, జుంగె సత్యనారాయణ, నవాత్ ప్రభాకర్, సాంగని బసవరాజ్, పిబి మనోహర్, ఆముద నరేష్, పటేరీ వాసు, నవాత్ ప్రసాద్, నవాత్ మహేష్, నవాత్ నవీన్, కాలేరు హరికిషన్, ఎం కె విటల్, సరిది వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- **డాక్టర్ పి. మురళీకృష్ణకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.**

**సదాశివపేట.సెప్టెంబర్ 6. (సిరిన్యూస్)**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కొడంగల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి. మురళీకృష్ణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, ఐఏఎస్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఐఏఎస్, జాయింట్ డైరెక్టర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు.

**కళాశాలకు గర్వకారణం. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి**

డాక్టర్ పి. మురళీకృష్ణకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి అన్నారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అకడమిక్ బోధనతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా మురళీకృష్ణ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతసాగర్ గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రత్యేక ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామ ప్రజల్లో చైతన్యం కల్పించారని, విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించారని అన్నారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఆయన ముందుంటారని ప్రశంసించారు.

**విద్యా రంగంలో విశిష్ట సేవలు**

విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత శాతం మెరుగుపడేందుకు డాక్టర్ మురళీకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించడంతో పాటు అనేక పుస్తకాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధనా వ్యాసాలు రచించారని చెప్పారు. వివిధ కళాశాలల బోర్డ్ ఆఫ్ స్టడీస్లో సభ్యుడిగా పనిచేస్తూ సిలబస్ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించే విధంగా బోధన చేయడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు. దామరగిద్దలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషిడాక్టర్ పి. మురళీకృష్ణ 2012లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై నారాయణ పేట జిల్లా దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవలు ప్రారంభించారు. కళాశాలకు తగిన భవనాలు లేని సమయంలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేసి సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో 14 భవనాల నిర్మాణం జరిగేలా తన వంతు కృషి చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

**శేరిలింగంపల్లి కళాశాల అభివృద్ధిలోనూ భాగస్వామ్యం**

2016లో పదోన్నతి పొంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల శేరిలింగంపల్లికి బదిలీ అయిన ఆయన, అప్పట్లో పరిమిత గదులతో కొనసాగుతున్న కళాశాల అభివృద్ధికి కృషి చేశారు. విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం పెంపుతో పాటు షిఫ్ట్ విధానం అమలులో కీలక పాత్ర పోషించారు. కళాశాల నూతన భవన నిర్మాణం కోసం సుమారు రెండు ఎకరాల భూమిని కేటాయించే ప్రక్రియలో కృషి చేయడంతో పాటు, డీపీసీ ద్వారా సుమారు రూ.70 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సహకరించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

**సామాజిక సేవలో ముందంజ**

2024 సాధారణ బదిలీలలో సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చిన అనంతరం ఎన్ఎస్ఎస్ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మురళీకృష్ణ విద్యార్థులను వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ పి. మురళీకృష్ణకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం ఆయన విద్యా, సామాజిక సేవలకు దక్కిన గుర్తింపుగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వనదుర్గ మాతకు జనహారతి



- **భక్తులతో కిటకిటలాడిన ఆలయం**
- **అమ్మవారిని దర్శించుకున్న చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్**

**పాపన్నపేట సెప్టెంబర్ 6 సిరి న్యూస్:**

ఏడుపాయల వనదుర్గాదేవి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. హైదరాబాద్, వివిధ ప్రాంతాల నుండి విశేషముగా తరలి వచ్చిన వేలాది భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు, కుంకుమార్చన విశేశాలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులు దుర్గాదేవి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్చించుకోన్నారు. దుర్గాదేవి అమ్మవారిని ఆలయ అర్చకులు ఆర్. శంకర్ శర్మ, పార్థీవ శర్మ ల ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఆలయ గర్భాలయంలో ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు కోటి సూర్యప్రభ కాంతులతో దీపాల మధ్య బంగారు వర్ణంలో దుర్గాదేవి అమ్మవారు దగదగలాడుతూ భక్త జనావళికి దర్శనమిచ్చారు. చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్ కుటుంబసభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని ఒడిబియ్యం, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. కొంతమంది భక్తులు సంతాన ప్రాప్తి కలగాలని మహిళలు అమ్మవారి సన్నిది లోని సంతాన గుండంలో భక్తిప్రవత్తులతో పుణ్యస్నానాలు ను ఆచరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ వీరేశం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, పి మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితర సిబ్బంది తమ తమ సేవలు అందించారు.

# శ్రావణ శోభతో అలరారిన వీరభద్రస్వామి క్షేత్రం

- **శ్రావణమాసం చివరి ఆదివారం**
- **బొంతపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 6( సిరి న్యూస్):**

జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలలో ఒకటైన బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తజనంతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర రాజధానికి చెరువులో ఉండడం మూలాన హైదరాబాద్ తో పాటు ఆ రాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణమాసం వచ్చిందంటే చాలు బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయానికి భక్తుల రాక పెరుగుతుంది. ముఖ్యంగా శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం రోజుల్లో ప్రత్యేక పూజలు, మొక్కుబడులు నిర్వహించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

**బారులు తీరిన భక్తులు**

స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దర్శనం కోసం కొందరు భక్తులు దాదాపు మూడు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొందరు భక్తులు ఆలయ గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, భద్రకాళి అమ్మవారిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు దంపతులు శ్రీచక్రం వద్ద కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి రోజులు కావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తి శోభతో నిండిపోయింది. భారీగా తరలివచ్చిన భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి రామ బ్రహ్మచారి, మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ధర్మకర్త అశోక్‌గౌడ్, దేవస్థాన సిబ్బంది సోమయ్య తదితరులు పర్యవేక్షించారు.



# బీజేపీ మండల కార్యవర్గాన్ని మరింత బలోపేతం చేయాలి

- **గుమ్మడిదల మండల అధ్యక్షుడు చింతల యాదగిరి ముదిరాజ్**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్ ):**

భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని గుమ్మడిదల మండల బిజెపి పార్టీ అధ్యక్షులు చింతల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు గుమ్మడిదల మండల కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం మండల అధ్యక్షుడు చింతల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సామల అంజి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బూత్ కమిటీలను మరింత పటిష్టం చేయడంతో పాటు యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు సోముల యాదగిరి, బొడ్డు రాజశేఖర్, ఉపాధ్యక్షులు మాధవ రెడ్డి, అందిపురం రాజు, వైపాల్ రెడ్డి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు శేఖర్ గౌడ్, వీరారెడ్డి, జూపతి రెడ్డి, మహేందర్ రెడ్డి,



భాస్కర్, ప్రశాంత్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షుడు దేవేందర్ రాజు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యుడు రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మిర్యాల శేఖర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రవీందర్, సత్యనారాయణ, శేఖర్, దళిత మోర్చా అధ్యక్షుడు దాచారం నరసింహ, బూత్ అధ్యక్షులు మురళీచారి, నాగరాజు, సాయిరాం రెడ్డి, బాల్ రెడ్డి, రాజు, సాయిరాం, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, నర్సింలు, భాస్కర్, రాజశేఖర్‌తో పాటు పలువురు సీనియర్ కార్యకర్తలు, పార్టీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# కరాటే ఛాంపియన్‌షిప్‌లో కుర్తివాడ విద్యార్థుల ప్రతిభ




**పాపన్నపేట 6 సెప్టెంబర్, సిరి న్యూస్ :**

గచ్చిబౌలి స్టేడియంలో టైకా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో కుర్తివాడ గ్రామానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో ముక్కుట్ల శ్రీనిక గోల్డ్ మెడల్, వేదశ్రీ సిల్వర్ మెడల్, గగన్ సిల్వర్ మెడల్, లతిక బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు ప్రముఖ సినీ నటుడు హీరో సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా

హాజరయ్యారు. పోటీలను నాగేష్ మాస్టర్ ప్రధాన ఆర్గనైజర్‌గా పర్యవేక్షించగా, మణి మాస్టర్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కుర్తివాడ గ్రామానికి, తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నాగేష్ మాస్టర్ ఆకాంక్షించారు.

# ఐక్యంగా ఉద్యమిస్తేనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం !

- **జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**
- **జర్నలిస్టులకు క్రమశిక్షణ చాలా అవసరం :**
- **రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్**
- **నారాయణఖేడ్‌లో టీయూడబ్ల్యూజే–ఐజేయూ సర్వసభ్య సమావేశం**

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 6 (సిరి న్యూస్ )**




జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని, ఐక్యంగా ఉద్యమిస్తామని టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, సంఘం బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి జిల్లా కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా చూడడంతో పాటు ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులకు సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణతో పాటు మండల స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేయాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమన్నారు. సమస్య ఏ ఒక్క జర్నలిస్టుదైనా యూనియన్ సమస్యగా భావించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన జర్నలిస్టులకు న్యాయ

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**వెల్దుర్తి, సెప్టెంబర్ 06,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం శెరిల్లా గ్రామానికి చెందిన మిర్జపల్లి రఘుపతి (29) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. శెరిల్లా గ్రామానికి చెందిన మీర్జాపల్లి రఘుపతి ఆదివారం ఉదయం సుమారు 9 గంటలకు శేరిల్లా కు చెందిన బండ మల్లేష్‌కు వ్యవసాయ పొలానికి గడ్డి కోసే యంత్రంతో వెళ్లాడు. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో గడ్డి కోస్తుండగా సమీపంలోని స్టార్టర్ బాక్స్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్నా ఎస్సై కరుణాకర్ రెడ్డి సంఘటన స్థలం చేరుకొని, శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తుప్రాన్ ప్రభుత్వ అస్పత్రి తరలించి, భార్య సునీత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎక్కడి దొంగలు అక్కడే గప్ చుప్





- **తూప్రాన్ లో దొంగతనాలు జరుగకుండా పోలీసుల విస్తృత వాహన తనిఖీలు**

**తూప్రాన్ సెప్టెంబర్ 6 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణంలో దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తూప్రాన్ పోలీసులు రాత్రివేళల్లో విస్తృతంగా వాహన తనిఖీలు తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి ఎస్ఐ గంగరాజు ఎస్ఐ జ్యోతి పోలీసు సిబ్బందితో తూప్రాన్ పట్టణంలోని వివిధ ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక వాహనా తనిఖీలు నిర్వహించారు తూప్రాన్‌లోని నర్సాపూర్ చౌరస్తా ప్రధాన కాలనీలు శివారు ప్రాంతాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా తనిఖీల్లో చేపట్టిన చర్యలు అనుమానాస్పదంగా ఉన్న 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు = గతంలో జరిగిన దొంగతనాలు ఇతర నేరాల నేపథ్యంలో ఫింగర్‌ప్రింట్ నిపుణుల సహాయంతో 10 మంది అనుమానిత వ్యక్తుల వివరాలను పరిశీలించి ఫింగర్‌ప్రింట్లను తనిఖీ చేశారు రాత్రివేళల్లో పట్టణంలోకి వచ్చే పట్టణం నుంచి వెళ్లే వాహనాలను తనిఖీ చేసి వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులు వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు సీఐ వెంకటరాజా గౌడ్ మాట్లాడుతూ దొంగతనాల నివారణ నేరాల నియంత్రణ ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రాత్రివేళల్లో ప్రత్యేక వాహన తనిఖీలు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నామని నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఇళ్లు దుకాణాలు గోదాములు పశువుల షెడ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 6, :**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దూషణలు, ట్రోలింగ్ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇప్పటివరకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళల భద్రత విషయంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ట్రోలింగ్‌లు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని కవిత అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, అయినప్పటికీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు గుర్తింపు, సంక్షేమం, భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత కోరారు. ఉద్యమకారులకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉన్నందున నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడానికి కారణం లేదన్నారు. కొంతమందికైనా గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలని అన్నారు.

# దౌల్తాబాద్‌లో 'సిరి షి కలెక్షన్' ప్రారంభం...

**హత్నూర, సెప్టెంబర్ 06,(సిరి న్యూస్)**

మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'సిరి షి కలెక్షన్' షోరూమ్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు.హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలో ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్ పైభాగంలో ఏర్పాటు చేసిన ఈ దుకాణంలో మహిళలకు అవసరమైన వివిధ రకాల చీరలు, నగలు, సుందరీకరణ, అలంకరణ వస్తువులు అందుబాటులో ఉంచారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ ప్రాంతంలో మహిళల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్తువులను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షాపు నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, స్థానిక వ్యాపారులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు నచ్చే విధంగా నూతన డిజైన్ల చీరలు, నగలు, అలంకరణ సామగ్రిని అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# హుస్సేన్ సాగర్ తీరంలో ఘనంగా తెలంగాణ గంగా తెప్పోత్సవం



- - ట్యాంక్ బండ్ వద్ద భక్తిశ్రద్ధల మధ్య గంగా హారతి
- - భారీగా తరలివచ్చిన మహిళలు, గంగపుత్రులు
- - కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- - మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద హుస్సేన్ సాగర్ తీరంలో తెలంగాణ గంగా తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగా హారతి స్వీకరించి భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్సేన్ సాగర్ తీర ప్రాంతం భక్తుల సందడితో కళకళలాడగా, గంగా మాత నామస్మరణలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ప్రజాప్రతినిధులు గంగపుత్రుల సంప్రదాయాలను కొనియాడుతూ వారి సేవలను గుర్తు చేశారు. గంగా తెప్పోత్సవానికి మహిళలు, గంగపుత్రులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగా హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా సాగగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాంప్రదాయ సంగీతం, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలోని గంగపుత్రులు, మత్స్యకారుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలు ఎంతో గొప్పవని అన్నారు. వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గంగపుత్రుల పాత్ర విశిష్టమైందని, వారి సంస్కృతి తెలంగాణ వారసత్వంలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. హుస్సేన్ సాగర్ తీరంలో నిర్వహించిన గంగా తెప్పోత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతి, గంగపుత్రుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. గంగా మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. కార్యక్రమం ముగింపులో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, గంగా హారతితో వేడుకలు ఆధ్యాత్మికంగా ముగిశాయి.



# మురికి కూపం నుంచి జలకళ వరకు.. ఉప్పల్ నల్లచెరువుకు కొత్త రూపు

హైదరాబాద్, సెప్టెంబర్ 6

నగరంలోని చెరువుల అభివృద్ధికి హైడ్రా చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికికూపాలుగా, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీరు, ముళ్లపొదలతో నిండిపోయి ప్రజలను భయపెట్టిన చెరువులు ఇప్పుడు సుందర విహార కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. చెత్తతో నిండిపోయిన ప్రాంతాలు జలకళతో కళకళలాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇప్పటికే మూడు చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా, మరో మూడు చెరువులు ఈ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధి పనులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆక్రమణల కారణంగా 52.30 ఎకరాలకు కుదించబడిన చెరువును హైడ్రా చర్యలతో 67.31 ఎకరాలకు విస్తరించారు. చెరువు చుట్టూ 2.4 కిలోమీటర్ల పొడవైన బండ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అన్ని వయసుల వారు సేద తీరేందుకు గజిబోలు, కూర్చునే ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులోకి వరదనీరు సులభంగా చేరేందుకు ఇన్‌లెట్లు, నీరు నిండిన తర్వాత ఎలాంటి వరద ముప్పు లేకుండా ఔట్‌లెట్లను కూడా అభివృద్ధి చేశారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఆక్రమణల తొలగింపుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువుల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సడలింపు లేకుండా చర్యలు తీసుకుంటూ సహజ స్వరూపాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణతో పాటు నగరంలో వర్షాకాల వరద సమస్యలను తగ్గించేందుకు ఈ అభివృద్ధి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంటలో పేరుకుపోయిన బయో వ్యర్థాలను పూర్తిగా తొలగించి, మురుగునీటిని నిర్మూలించి చెరువును అభివృద్ధి చేసిన తీరును పరిశీలించారు. చెరువుకు సమీపంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వేర్వేరు చేసే కేంద్రాల వల్ల కాలుష్య ముప్పు ఉందని గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు పరిసరాలను పరిశీలించిన కమిషనర్, చెరువుకు ఆనుకుని ఉన్న బండపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు చుట్టూ మరింత పచ్చదనం పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ ప్రాంతాలు భవిష్యత్తులో నగరవాసులకు విశ్రాంతి కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. అంతకుముందు కృష్ణాకాంత్ పార్కు చెరువును కూడా కమిషనర్ పరిశీలించారు. రెండో విడతలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. ఈ చెరువు లోతు, విస్తీర్ణం పెరిగితే వరద నీటి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, శ్రీనివాసనగర్, అమీర్‌పేట ప్రాంతా లకు వరద ముప్పును తగ్గించడంలో ఈ చెరువు అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

# సర్ నోటీసుకు స్పందించి బిఎల్ఓకు పత్రాలు అందజేసిన పులిమామిడి రాజు

- నోటీసులు అందిన ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దు.
- పులిమామిడి రాజు

సదాశివపేట. సెప్టెంబర్ 6. (సిరిన్యూస్)



సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో 10వ వార్డుకు చెందిన అంగన్వాడి టీచర్ బిఎల్ఓ శ్రీరాముల జయశ్రీ తనకు అందిన సార్ నోటీసుకు సంబంధించిన అవసరమైన పత్రాలను పులిమామిడి రాజు సమర్పించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ సర్ నోటీసులు అందిన ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, బిఎల్ఓలు సూచించిన సంబంధిత పత్రాలను సమయానికి సమర్పించి తమ ఓటు వివరాలను పక్కాగా చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల వయస్సు తేడా ఉన్న తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాల్లో అవసరమైన సందర్భాల్లో 2002 సంవత్సరానికి సంబంధించిన సర్ డేటా పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా గుర్తింపు లేదా సంబంధిత పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా 40 సంవత్సరాలు పైబడిన వారు, వయస్సు ఎక్కువగా ఉన్న ఓటర్లు 2002 సంవత్సరానికి సంబంధించిన సార్ డేటా లిస్టును సమర్పించాలని సూచించారు. తండ్రి పేరు, ఇంటిపేరు తదితర వివరాల్లో తప్పులు ఉన్నవారు, అలాగే యువత తమకు సంబంధించిన సరైన పత్రాలను బిఎల్ఓలకు అందజేసి ఓటు వివరాలను సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సార్ నోటీసుకు సంబంధించి సందేహాలు ఉంటే, తమ ఎన్యూమరేషన్ ఫామ్ పైభాగంలో ముద్రించిన బిఎల్ఓ పేరు, ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అలాగే తమకు అందిన నోటీసులో కూడా బిఎల్ఓ ఫోన్ నంబర్‌తో పాటు పత్రాలు సమర్పించాల్సిన తేదీ, సమయం పొందుపరిచి ఉంటాయని చెప్పారు. కావున ఓటర్లు తమకు అందిన నోటీసును జాగ్రత్తగా పరిశీలించి, అందులో పేర్కొన్న తేదీలోపు అవసరమైన పత్రాలతో బిఎల్ఓ కు సమర్పించాలని, 18సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు ఫామ్ 6 ద్వారా మీసేవలో అప్లై చేసుకోవాలని పులిమామిడి రాజు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు సార్ ప్రక్రియలో భాగంగా బిఎల్ఓలకు సహకరించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బిఎల్ఓలను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సంగారెడ్డి నియోజక వర్గ ప్రజలకు పులిమామిడి రాజు విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో వారి మిత్రులు బగిలి విష్ణు, నర్సింలు, షకీల్, రాము, సోమ శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

# పోస్టింగ్ ఎక్కడో.. డ్యూటీ ఇంకెక్కడో!

- మెదక్ విద్యుత్ డివిజన్‌లో సబ్ ఇంజనీర్ల 'సర్దుబాటు' వ్యవహారం.. బదిలీ ఉత్తర్వులున్నా పాతచోటే ఇన్‌చార్జి బాధ్యతలు క్షేత్రస్థాయి సిబ్బందికి మాత్రం డిప్యూటేషన్ నిబంధనలు.. ఒకే సంస్థలో పలు రకాల రూల్స్

మెదక్ సెప్టెంబర్ 6 సిరి న్యూస్




మెదక్ విద్యుత్ డివిజన్ పరిధిలో సబ్ ఇంజనీర్ల విధుల కేటాయింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఒకచోట పోస్టింగ్.. మరోచోట డ్యూటీ అన్నట్లుగా కొందరు సబ్ ఇంజనీర్లు విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ కొత్తగా పోస్టింగ్ పొందిన ప్రాంతంలో కాకుండా ఇతర సెక్షన్లు, సబ్ డివిజన్లలో విధులు కొనసాగించడం, మరోవైపు కొత్తగా వచ్చిన అధికారికి పూర్తిస్థాయి చార్జి ఇవ్వకుండా పాత అధికారి ఇన్‌చార్జిగా కొనసాగడం వంటి పరిణామాలు ఉద్యోగ వర్గాల్లో పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి.

పెద్దశంకరంపేటకు బదిలీ ఉత్తర్వులు వచ్చిన సబ్ ఇంజనీర్ ప్రస్తుతం అల్లాదుర్గం సెక్షన్‌లో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అల్లాదుర్గం సెక్షన్‌కు కొత్తగా సబ్ ఇంజనీర్ పోస్టింగ్ ఉత్తర్వులతో వచ్చినప్పటికీ.. ఆయన అక్కడ పూర్తిస్థాయిలో విధులు నిర్వహించాల్సి ఉండగా పాపన్నపేట సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పోస్టింగ్ ఉత్తర్వులతో వచ్చిన అధికారికి అల్లాదుర్గం సెక్షన్ పూర్తి చార్జి ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది.

బదిలీ ఉత్తర్వులతో మరో ప్రాంతానికి వెళ్లాల్సిన సబ్ ఇంజనీర్ అదే సెక్షన్‌లో ఇన్‌చార్జిగా కొనసాగుతుండటం వెనుక కారణాలేమిటన్నది ఉద్యోగుల్లో చర్చకు దారితీస్తోంది. కొత్తగా వచ్చిన సబ్ ఇంజనీర్‌కు చార్జి అప్పగించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ.. వేరే సెక్షన్‌కు బదిలీ అయిన అధికారి ఇక్కడే ఇన్‌చార్జిగా కొనసాగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఇలాంటి విధుల కేటాయింపు జరిగితే దానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఏమిటన్నది కూడా స్పష్టత రావాల్సి ఉంది.

ఇక పాపన్నపేట సబ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఉన్న వ్యక్తి మెదక్ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో పాపన్నపేటకు పోస్టింగ్ ఉన్న అధికారి అక్కడ కాకుండా డివిజన్ కార్యాలయంలో ఎందుకు విధులు నిర్వహిస్తున్నారన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. ఒకవైపు సబ్ డివిజన్లలో క్షేత్రస్థాయిలో అధికారుల అవసరం ఉండగా.. పోస్టింగ్ ఉన్న ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే పరిస్థితి ఎందుకు ఏర్పడిందో అధికారులు వివరించాల్సిన అవసరం ఉంది.

సాధారణంగా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు లేదా బదిలీపై కొత్త పోస్టింగ్ పొందిన సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలోనే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పోస్టింగ్ స్వభావం, శాఖా నిబంధనలు, పరిపాలనా అవసరాలను బట్టి నిర్దిష్ట కాలం పాటు అక్కడ విధులు కొనసాగించే విధానం ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం పోస్టింగ్ ఆర్డర్లు ఒక ప్రాంతానికి ఉన్నప్పటికీ.. విధులు మరో ప్రాంతంలో కొనసాగుతున్నట్లు కనిపిస్తుండటంతో నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల పరిస్థితి భిన్నంగా ఉందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినా డిప్యూటేషన్ నిబంధనలు, బదిలీ ఉత్తర్వులు అంటూ ప్రక్రియను కచ్చితంగా పాటించాలని చెబుతున్నారని వారు అంటున్నారు. కానీ సబ్ ఇంజనీర్ల విషయంలో పోస్టింగ్ ఉన్న ప్రాంతానికి భిన్నంగా విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంటే.. ఆ అవకాశం ఏ నిబంధనల కింద కల్పిస్తున్నారన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది.

ఒకే విద్యుత్ సంస్థ.. ఉద్యోగుల విషయంలో రూల్స్ మాత్రం వేర్వేరా అన్న చర్చ ఇప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందిలో వినిపిస్తోంది. కింది స్థాయి సిబ్బందికి డిప్యూటేషన్ విషయంలో నిబంధనలు కచ్చితంగా వర్తింపజేస్తూ.. సబ్ ఇంజనీర్లకు మాత్రం పోస్టింగ్ ప్రాంతాన్ని మార్చి విధులు నిర్వహించే అవకాశం ఉంటే దానికి కారణం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అల్లాదుర్గం సెక్షన్‌కు పోస్టింగ్ ఉత్తర్వులతో వచ్చిన సబ్ ఇంజనీర్‌కు పూర్తి చార్జి ఎందుకు ఇవ్వడం లేదు పెద్దశంకరంపేటకు బదిలీ అయిన సబ్ ఇంజనీర్ అల్లాదుర్గంలో ఇన్‌చార్జిగా కొనసాగడానికి కారణమేంటి పాపన్నపేట పోస్టింగ్ ఉన్న సబ్ ఇంజనీర్ మెదక్ డివిజన్‌లో విధులు నిర్వహించడానికి అనుమతి ఎవరిచ్చారు వీరికి డిప్యూటేషన్ లేదా అదనపు బాధ్యతలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా ఉంటే వాటి కాలపరిమితి ఎంత అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయి సేవలు కీలకం కావడంతో ప్రతి సబ్ డివిజన్‌కు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండటం అవసరం. పోస్టింగ్‌లు ఒకచోట, విధులు మరోచోట ఉంటే సంబంధిత ప్రాంతాల్లో పర్యవేక్షణ, వినియోగదారుల సమస్యల పరిష్కారం, క్షేత్రస్థాయి పనులపై ప్రభావం పడే అవకాశం ఉంది. అందువల్ల బదిలీ ఉత్తర్వులు, పోస్టింగ్ వివరాలు, డిప్యూటేషన్లు, అదనపు బాధ్యతలపై ఉన్నతాధికారులు సమీక్షించి స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. పోస్టింగ్ ఆర్డర్ ఒకచోట.. డ్యూటీ మరోచోట.. మధ్యలో అసలు నిబంధనలు ఏమిటి అన్న ప్రశ్నకు మెదక్ విద్యుత్ డివిజన్ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. ఒకే సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ నిబంధనలు సమానంగా వర్తించేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బంది కోరుతున్నారు

# బీజేపీలోకి పలువురు నాయకులు, కార్యకర్తల చేరిక







- - రాష్ట్ర పార్టీ కార్యాలయంలో చేరిక కార్యక్రమం
- - నరేంద్ర మోదీ వికసిత్ భారత్ దార్శనికతకు ఆకర్షితులై చేరిక
- - పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు
- - దేశసేవ లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 :

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలకు చెందిన నాయకులు పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఎన్. రామచందర్ రావు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో వివిధ వర్గాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు.

దేశాభివృద్ధి, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. "నేషన్ ఫస్ట్" అనే సిద్ధాంతాన్ని పార్టీ ప్రధాన మార్గదర్శకంగా తీసుకుని పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను అన్నింటి కంటే ముందుగా ఉంచే రాజకీయ సంస్కృతిని బీజేపీ ప్రోత్సహిస్తోందని చెప్పారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని రామచందర్ రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంలో కొత్తగా చేరినవారు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకు బలపడుతోందని, ప్రజల మద్దతు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు అవకాశాలు, రైతుల సంక్షేమం, మహిళల సాధికారత వంటి అంశాలపై పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దేశాభివృద్ధి లక్ష్యాల సాధనకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నిద్ర పట్టడం లేదా? ఈ డ్రింక్స్ తాగండి..!



**ఉదయం ఎంత కష్టపడినా రాత్రి చక్కగా నిద్ర పడితేనే అలసట తగ్గేది. ఇప్పుడు ఒడిదుడుకల జీవనశైలిలో అంతర్లీన ఆరోగ్య సమస్యల కారణంగా హాయిగా నిద్రపోతున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. ఒత్తిడి కారణంగా నిద్రలేమి, ఆందోళన వంటి సమస్యలతో బాధపడుతూ సగం రాత్రి వరకు లేచి ఉంటున్నారు. మీరు హాయిగా నిద్ర పోవాలంటే కొన్ని చిట్కాలను పాటించాలి.**

**కొంతమంది నిద్ర మాత్రలు వేసుకుని హాయిగా నిద్రపోవడానికి ప్రయత్నిస్తారు. అది ఏమాత్రం మంచి పద్ధతి కాదు. నిద్ర మాత్రలకు అలవాటు పడితే ఆ టాబ్లెట్ లేనిదే ఇక మీకు నిద్ర పట్టదు. కాబట్టి ఆయుర్వేదం ప్రకారం సహజ పద్ధతుల్లోనే మీకు నిద్ర వచ్చేలా చేసుకోవాలి. అందుకోసం కొన్ని రకాల పానీయాలు ఉన్నాయి. వీటిని రాత్రి నిద్ర పోయేముందు తాగండి. వీటిని తాగాక ఒక అరగంట గంటలో మీకు మంచి నిద్ర పడుతుంది.**

**అశ్వగంధ పాలు**

అశ్వగంధ ఎన్నో ఆరోగ్య విలువలు కలిగిన ఔషధం. ఇది ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను ఎదుర్కోవడానికి సహాయపడుతుందని ఆయుర్వేదం కూడా చెబుతోంది. ఒక కప్పు గోరువెచ్చని పాలలో అశ్వగంధ పొడిని అర స్పూను కలుపుకొని తాగితే మీ శరీరంలో ఒత్తిడి హార్మోన్ అయినా కార్టిసాల్ ఉత్పత్తి తగ్గిపోతుంది. అంతేకాదు ఒత్తిడిని తట్టుకునే శరీర సామర్థ్యాన్ని కూడా మీకు అందిస్తుంది. నిద్రపోయే ముందు అశ్వగంధ పాలను తాగండి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. నిద్రా నాణ్యత కూడా పెరుగుతుంది.



**పసుపు పాలు**

పాలల్లో పసుపు కలుపుకొని తాగే అలవాటు ఎప్పటినుంచో ఉంది. దీన్ని గోల్డెన్ మిల్క్ అని పిలుస్తారు. కానీ నేటి యువత మాత్రం ఈ పసుపు కలిపిన పాలు తాగేందుకు ఇష్టపడడం లేదు. ఇలా తాగడం వల్ల మీరు ఒత్తిడి నుంచి బయటపడతారు. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలుపుకొని తాగితే మీ మానసిక స్థితి మెరుగవుతుంది. నిద్ర హాయిగా పడుతుంది. సెరటోనిన్, మెలటోనిన్ అనే రెండు హార్మోన్లు చక్కగా ఉత్పత్తి అయ్యి నిద్ర వచ్చేలా చేస్తాయి.



**కుంకుమపువ్వు పాలు**

పాలల్లో కుంకుమ పువ్వు కలుపుకొని తాగడం అనేది మన దేశంలో పూర్వకాలంలోనే ఉంది. కానీ గర్భిణీలు మాత్రమే ఇలా తాగుతారని అనుకుంటారు. నిజానికి కుంకుమపువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇవి నిద్రను ప్రేరేపిస్తాయి. పాలల్లో రెండు రేకుల కుంకుమ పువ్వులు వేసి బాగా కలుపుకొని తాగండి. కుంకుమ పువ్వులో ఉండే క్రోసిన్, సాఫ్రానల్ వంటి క్రియాశీల సమ్మేళనాలు మానసిక మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని, మానసిక ఆందోళన తగ్గిస్తాయి. నిద్రలేమి మానసిక ఒత్తిడి రాకుండా కాపాడతాయి.



**తులసి టీ**

హిందువుల ఇంట్లో తులసి మొక్క ఉండడం ఆచారంగా మారిపోయింది. ఈ పవిత్రమైన తులసి మన ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముందుంటుంది. భారతీయ సంస్కృతిలో పవిత్రమైన మూలికల్లో తులసి కూడా ఒకటని నమ్ముతారు. దీనిలో అడాప్టోజెనిక్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఈ తులసి ఆకులు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఒత్తిడి హార్మోన్ అయినా కార్టిసాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇది మనసును, శరీరం రెండింటిపై మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. నిద్రా నాణ్యతను మెరుగుపరుస్తుంది.

**బాదంపాలు**

బాదంపప్పు నుంచి తయారు చేసేది బాదంపాలు. ఈ బాదంపప్పులో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. మెగ్నీషియం అధికంగా ఉంటే నిద్రా నాణ్యత కూడా పెరుగుతుంది. మానసిక ఆందోళన తగ్గుతుంది. బాదంపాలలో చిటికెడు జాజికాయ పొడిని వేసుకుని బాగా కలుపుకోండి. వాటిని తాగితే మీ నాడీ వ్యవస్థ శాంతంగా మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. ప్రశాంతమైన నిద్ర కూడా పడుతుంది. మీరు కొన్ని రోజుల పాటు ఈ బాదంపాలు, జాజికాయ పొడి కలుపుకొని తాగి చూడండి. మీకు కచ్చితంగా మంచి ఫలితాలు కనిపిస్తాయి.



**మునగాకు టీ**

మునగాకులు విరివిగా మార్కెట్లో లభిస్తాయి. ఈ మునగాకులను ఏరి కడిగి వాటితో టీ పెట్టుకుని నిద్రపోవడానికి ముందు తాగేందుకు ప్రయత్నించండి. ఇలా చేయడం వల్ల నిద్రలేమి, ఒత్తిడి, మానసిక ఆందోళన వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఆయుర్వేద వైద్యంలో కూడా మునగాకును ఎంతో ఉపయోగిస్తారు. మన శరీరానికి అత్యవసరమైన సెరటోనిన్ హార్మోన్ ను ఉత్పత్తి చేయడానికి అవసరమైన అమైనో ఆమ్లం దీనిలో ఉంటుంది. ఇది నిద్రను నియంత్రించే మెలటోనిన్ ను ఉత్పత్తి చేస్తుంది.



# మధుమేహం తగ్గించుకొనే టిప్స్ ఇవే..

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఫాస్ట్ లైఫ్‌లో ఏదో ఒక వ్యాధిని ఎదుర్కొంటున్నారు. మధుమేహం చాలా తీవ్రమైన జీవనశైలి సంబంధిత వ్యాధి. ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధిలా వ్యాపిస్తోంది. ఈ వ్యాధి నుంచి బయటపడాలనుకుంటే.. జీవనశైలిని మెరుగుపరచడం ద్వారా మాత్రమే సాధ్యమౌతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆహారాన్ని మెరుగుపరచడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి నుంచి ఉపశమనం ఉంటుంది. మందులే కాకుండా మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని నియంత్రించడానికి కొన్ని ఇంటి నివారణలను చిట్కాలు ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు మెంతి గింజలను తీసుకోవాలి. ఇది రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. మధుమేహ వ్యాధికి మెంతి గింజలు ఎలా ఉపయోగపడతాయో, వాటిని ఎలా తీసుకోవాలో ఈ ఆర్టికల్‌లో కొన్ని విషయాలు తెలుసుకుందాం.


**మెంతి గింజలతో మధుమేహానికి చెక్:**

డయాబెటిస్‌తో బాధపడేవారికి మెంతికూర తీసుకోవడం చాలా మంచిది. మెంతికూరలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను తగ్గించి శరీరం కార్బోహైడ్రేట్లు, చక్కెరను గ్రహించడాన్ని తగ్గిస్తుంది. ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ విటమిన్ అండ్ న్యూట్రిషన్ రీసెర్చ్ ప్రకారం.. ప్రతిరోజూ 10 గ్రాముల మెంతి గింజలను గోరువెచ్చని నీటిలో నానబెట్టి తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడేవారిలో బ్లడ్ షుగర్‌ని తగ్గించే సామర్థ్యం మెంతి గింజల నీటిలో ఉంది. దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే ఇన్సులిన్‌ని మెరుగుపరుస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. దానికోసం ఒక గిన్నె నీటిలో మెంతి గింజలను రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి.

**మెంతులు తీసుకునే విధానం:**

అర టీస్పూన్ మెంతి గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టండి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగాలి. మెంతులు గింజలను నమలడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. మెంతి గింజలను తినలేకపోతే.. మెంతి పొడిని కూడా ఉపయోగించవచ్చు.

స్థూలకాయం సమస్య ఉంటే కూడా మెంతి తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. త్వరగా బరువు పెరుగుతుంటే.. ఆహారంలో మెంతులు చేర్చుకుంటు మంచి ఫలితం ఉంటుంది. మెంతి నీరు తాగడం వల్ల బరువు తగ్గుతారు. ఇది కడుపు నిండుగా ఉంచుతుంది, కేలరీల తీసుకోవడం తగ్గిస్తుంది. మెంతులు తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు



# హెల్దీ స్నాక్స్.. సాయంత్రం వీటిని ట్రై చేయండి



**సాయంత్రం అయ్యిందంటే చాలు ఏదో ఒకటి తినేయాలని అందరికీ అనిపిస్తుంటుంది. కానీ ఏం తిందామన్న భయమే. ఇక శరీర బరువు నియంత్రణలో ఉండాలంటే తీసుకునే ఆహారం చాలా ముఖ్యం. పోషకాలతో కూడిన ఆహారాన్ని మోతాదు మేరకు తీసుకోవాలి. అలాగే, బరువు తగ్గాలనుకునే వారు స్నాక్స్ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. స్నాక్సే కదా అని ఏవిపడితే అవి తినకూడదు. స్నాక్స్‌గా నూనెలో వేయించిన ఆహారాలు, ప్రాసెస్డ్, ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్ లాంటివి తింటే శరీర బరువు పెరుగుతుంది. అందుకే ఆరోగ్యకరమైన స్నాక్స్ తినాలి. వీటి వల్ల బరువు పెరిగే రిస్క్ ఉండదు. ఆరోగ్యానికి ప్రయోజనాలు ఉంటాయి. అలాంటి మూడు రకాల హెల్దీ స్నాక్స్ గురించి ఇక్కడ తెలుసుకోండి.**

**నట్స్**

బాదం, వాల్‌నట్స్, పిస్తా, జీడిపప్పు లాంటి నట్‌స్‌ను స్నాక్‌గా తినవచ్చు. ఇవి రుచికరంగానూ ఉంటాయి. ఒకవేళ స్నాక్స్ తినాలని అనిపిస్తే ప్రాసెస్డ్ ఫుడ్స్ ప్యాకెట్ తీసుకునే బదులు నట్స్ తినొచ్చు. ఆకలిని నట్స్ తగ్గిచ్చేస్తాయి. కడుపు నిండిన సంతృప్తిని ఇస్తాయి. నట్‌స్‌లో ప్రోటీన్, మెగ్నిషియం, ఐరన్ సహా కీలకమైన విటమిన్స్, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి తినడం తింటే బరువు తగ్గేందుకు తోడ్పడతాయి. వెయిట్ పెరిగే అవకాశాలు చాలా తక్కువ. నట్స్ తీసుకుంటే శరీరంలో శక్తి, చురుకుదనం పెరుగుతాయి. ఆరోగ్యానికి పూర్తిస్థాయిలో లాభాలను అందిస్తాయి.

**విత్తనాలు**

గుమ్మడి, అవిసె, చియా, పొద్దుతిరుగుడు విత్తనాలు (సీడ్స్) కూడా ఆరోగ్యకరమైన స్నాక్‌స్‌గా ఉంటాయి. చిప్స్ లాంటి స్థానంలో ఈ విత్తనాలు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో ఫైబర్, కాల్షియం, ఐరన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6, కీలకమైన విటమిన్లు సహా మరిన్ని పోషకాలను కలిగి ఉంటాయి. ఇవి తినడం ఓవరాల్ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. మంచి ఎనర్జీ వస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు తప్పకుండా సీడ్స్ తీసుకోవాలి. విత్తనాలను నేరుగా తినడమో, కాల్చుకొని తినడమో, సలాడ్లు సహా ఇతర వాటిలోనూ కలుపుకొని తినొచ్చు.

**పాప్‌కార్న్.. కానీ ఓ కండీషన్**

పాప్‌కార్న్ కూడా హెల్దీ స్నాక్ ఆప్షన్‌గా ఉంటుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా క్యాలరీలు తక్కువగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు కూడా మెండుగా ఉంటాయి. ఇవి తింటే జీవక్రియ మెరుగవుతుంది. కడుపు నిండిన ఫీలింగ్ ఇస్తుంది. ఆకలి తగ్గిస్తుంది. దీంతో బరువు తగ్గేందుకు సహకరిస్తుంది. అయితే, పాప్‌కార్న్ ప్లెయిన్‌గా తీసుకోవాలి. ఫ్లేవర్లు ఉండే పాప్‌కర్న్ తింటే క్యాలరీలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. అందుకే పాప్‌కార్న్ ప్లెయిన్‌గానే తింటే మేలు.

స్ట్రాబెర్రీలు, బ్లాక్‌బెర్రీలు లాంటి బెర్రీలను స్నాక్‌గా తీసుకున్నా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. నారింజ పండ్లను కూడా స్నాక్‌గా తీసుకోవచ్చు. బరువు తగ్గే ప్రయత్నంలో హెల్దీ స్నాక్స్ తీసుకోవడం కీలకంగా ఉంటుంది.







# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది. ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్




'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.





# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.


www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
సిరి
People's Voice వార్తపత్రిక
సోమవారం
సెప్టెంబర్-7-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 240
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

# హాస్టల్ పిల్లల కష్టాలు వర్ణనాతీతం

- కనీస సౌకర్యాలు లేని బాలుర వసతి గృహం!
- గదులు సరిపోక ఇబ్బందులు..
- ఆట స్థలం లేదు.. మరుగుదొడ్ల కొరతతో అవస్థలు



2






# క్రషర్ లారీలతో రోడ్లంతా గుల్ల!

- స్వచ్ఛ పల్లెపై క్వారీ దండయాత్ర
- క్వారీ వ్యాపారులకు లాభాలు.. జనం నడుములకు ఫ్రాక్చర్లు
- కంకర రవాణా కాదు మరణ శాసనం
- టన్నుల భారం తారు రోడ్డు నాశనం
- పర్మిషన్ ఒకటి లోడింగ్ ఇంకొకటి
- నిద్రపోతున్న రవాణా శాఖ
- క్వారీ వైపు చూడని మైనింగ్ శాఖ
- మాదారం టు కిష్టారెడ్డిపేట వరకు మరణ మృదంగం

3

జిన్నారం, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం గ్రామ సమీపంలో కంకర క్వారీ మైనింగ్ బ్లాస్టింగ్లు క్రషింగ్ దుమ్ము వల్ల మాదారం, మంత్రి కుంట, కొర్లకుంట, జానకంపేట, దువ్వగుంట గ్రామాల ప్రజలకు నరకప్రాయంగా మారింది. కంకర క్వారీల దుమ్ము ధూళి బ్లాస్టింగ్లతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. క్వారీల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోస సమస్యలు చుట్టుముడుతున్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల దుమ్ము ధూళి పక్కనే ఉన్న పొలాలపై పడడంతో పంటలు పాడైపోయి, చెట్లు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు



వాపోతున్నారు. క్వారీ టిప్పర్ల వల్ల రోడ్లు గుల్లై ఇళ్లలోకి దుమ్ము చేరుతుండడంతో మహిళలు, యువకులు, స్థానికులు రోడ్ల పైకి వచ్చి లారీలను అడ్డుకుంటూ ధర్నాలు చేస్తున్నారు. నిత్యం వందలాది ఓవర్ లోడ్ టిప్పర్లు అతి వేగంగా తిరుగుతుండడంతో పిల్లలు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు.



# అజయ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాక్ బాల్ పోటీలు

### 16 రాష్ట్రాలు 54 జట్లు పాల్గొన్నాయి


- అజయ్ ఫౌండేషన్ చైర్మన్ మురళి యాదవ్
- నేటి యువత క్రీడలలో రాణించాలి
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

4

# హామీల అమలుకు బీఆర్ఎస్ డిమాండ్

- పటాన్చెరులో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ వరకు ఆటోల ర్యాలీ
- ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తాం: బీఆర్ఎస్

రామచంద్రపురం /పటాన్చెరు, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యం లో పటాన్చెరు నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.



2

- కనీస సౌకర్యాలు లేని బాలుర వసతి గృహం!
- గదులు సరిపోక ఇబ్బందులు..
- ఆట స్థలం లేదు.. మరుగు దొడ్ల కొరతతో అవస్థలు







# హాస్టల్ పిల్లల కష్టాలు వర్ణనాతీతం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్ ):** నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేస్తోంది. అయితే పారిశ్రామిక వాడ ప్రాంతమైన, మున్సిపాలిటీ కేంద్రమైన గుమ్మడిదలలోని బాలుర వసతి గృహంలో మాత్రం కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ వసతి గృహానికి సొంత భవనం ఉండేది. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడి నుంచి విద్యార్థులను ప్రాథమిక పాఠశాల సమీపంలోని టెలిఫోన్ ఎక్స్చేంజ్ కార్యాలయ భవనానికి తరలించారు. ప్రస్తుతం ఆ భవనంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## ఆటలకు చోటేది.. అవసరాలకు సౌకర్యాలేవి?

విద్యార్థులు ఆడుకోవడానికి సరైన స్థలం లేకపోవడం, వారి సంఖ్యకు తగిన విధంగా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో నిత్యం అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు వాపోతున్నారు. అంతేకాకుండా వసతి గృహం నుంచి పాఠశాల వరకు సుమారు అర కిలోమీటర్ మేర పుస్తకాలను మోసుకుంటూ విద్యార్థులు నడిచి వెళ్లాల్సి వస్తోంది. దీంతో చిన్నారులపై అదనపు భారం పడుతోందని తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకుదెరువు కష్టంగా ఉండటంతో తమ పిల్లలకు మెరుగైన విద్య అందాలనే ఆశతో వసతి గృహంలో చేర్పిస్తే, కనీస సౌకర్యాలు కూడా లేక వారు ఇబ్బందులు పడుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. విద్యార్థులు తమ బట్టలను ఆరబెట్టుకోవడానికి సైతం సరైన స్థలం లేకపోవడంతో టెలిఫోన్ ఎక్స్చేంజ్ పక్కభాగంలో ఉన్న ఇనుప రాడ్లపైకి ఎక్కి బట్టలను ఆరబెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రమాదకరమని తెలిసినా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించాలని, బాలుర వసతి గృహానికి శాశ్వత భవనాన్ని నిర్మించి, విద్యార్థుల సంఖ్యకు తగిన గదులు, మరుగుదొడ్లు, ఆట స్థలం తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# టీచర్స్ డే రోజున అరుదైన గౌరవం!

- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సర్వే పల్లె రాధాకృష్ణ
- సబ్ కలెక్టర్ ఉమ హారతి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ
- సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని కొనియాడిన ప్రముఖులు



సంగారెడ్డి, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్): ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తున్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు పండిట్‌గా సుదీర్ఘకాలంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న సర్వే పల్లె రాధాకృష్ణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్నారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ శ్రీమతి ఉమ హారతి ఐఏఎస్ చేతుల మీదుగా ఆమె ఈ ఘనమైన అవార్డును స్వీకరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, టీపీఈ పూర్తి చేసిన ఆమె, 2024లో స్కూల్ అసిస్టెంట్ (గ్రేడ్-1)గా పదోన్నతి పొందారు. విద్యాబోధనలో ఆమె చూపిన ప్రతిభకు గాను గతంలో 2021లో లయన్స్ క్లబ్ ద్వారా, 2023లో పటాన్‌చెరు మండల స్థాయిలో నాటి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారాలు అందుకున్నారు. ఆమె విద్యా ప్రస్థానం కొనసాగిన తీరు పరిశీలిస్తే.. 2002 నుండి 2009 వరకు పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో, 2009 నుండి 2012 వరకు టెక్మాల్ మండలం ఏలకుర్తి జెడ్పీ హైస్కూల్‌లో సేవలందించారు. ఆ తర్వాత 2012 నుండి 2024 వరకు పటాన్‌చెరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేసి విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం 2024 నుండి హత్నూర మండలం నాగారం జెడ్పీ హైస్కూల్‌లో ఆమె పదోన్నతిపై సేవలందిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా జరిగిన ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో సంగారెడ్డి డీఈఓ, హత్నూర ఎంఈఓ శ్రీ వెంకట నర్సింలు, ఇతర విద్యాశాఖ అధికారులు మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ గొల్ల అంజయ్య గారు తదితరులు పాల

# హామీల అమలుకు బీఆర్ఎస్ డిమాండ్

- -పటాన్‌చెరులో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- -బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ వరకు ఆటోల ర్యాలీ

**ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తాం: బీఆర్ఎస్**

**రామచంద్రపురం /పటాన్‌చెరు, సెప్టెంబర్ 6 (సిరి న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. తాగునీరు, వీధి దీపాలు, శాంతిభద్రతలు, బస్తీ దవాఖానాల ఏర్పాటు వంటి స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన సభలో మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, విద్యార్థులకు స్కూటీలు, దివ్యాంగులకు పెన్షన్లు వంటి హామీల అమలుపై నాయకులు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజ లకు న్యాయం చేయాలని కోరుతూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు, మహిళలు, విద్యార్థులు, దివ్యాంగులు, ప్రజలు పాల్గొన్నారు.








# కృష్ణ బృందావన్ కాలనీలో ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్ విజయం

**53 ఓట్ల మెజారిటీతో గెలుపు..**

**అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడి ఎన్నిక**

సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 6 (సిరి న్యూస్) అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ బృందావన్ కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించింది. మొత్తం 307 ఓట్లు పోలవగా, ప్రవీణ్‌రెడ్డి ప్యానెల్‌కు 180 ఓట్లు లభించాయి. ప్రత్యర్థి ప్యానెల్‌పై 53 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శరత్, కోశాధికారిగా త్రినాథ్‌బాబు, జాయింట్ సెక్రటరీగా యోగేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేవంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను కాలనీ వాసులు అభినందించారు. కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పా టు స్థానిక సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.









# క్రషర్ లారీలతో రోడ్లంతా గుల్ల!



- స్వచ్ఛ పల్లెపై క్వారీ దండయాత్ర
- క్వారీ వ్యాపారులకు లాభాలు.. జనం నడుములకు ఫ్రాక్చర్లు
- కంకర రవాణా కాదు మరణ శాసనం
- టన్నుల భారం తారు రోడ్డు నాశనం
- పర్మిషన్ ఒకటి లోడింగ్ ఇంకొకటి
- నిద్రపోతున్న రవాణా శాఖ
- క్వారీ వైపు చూడని మైనింగ్ శాఖ
- మాదారం టు కిష్టారెడ్డిపేట వరకు మరణ మృదంగం

జిన్నారం, సెప్టెంబర్ **6** (సిరి న్యూస్) : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం గ్రామ సమీపంలో కంకర క్వారీ మైనింగ్ బ్లాస్టింగ్లు క్రషింగ్ దుమ్ము వల్ల మాదారం, మంత్రి కుంట, కొర్లకుంట, జానకంపేట, దువ్వగుంట గ్రామాల ప్రజలకు నరకప్రాయంగా మారింది. కంకర క్వారీల దుమ్ము ధూళి బ్లాస్టింగ్లతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. క్వారీల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోస సమస్యలు చుట్టుముడుతున్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల దుమ్ము ధూళి పక్కనే ఉన్న పొలాలపై పడడంతో పంటలు పాడైపోయి, చెట్లు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. క్వారీ టిప్పర్ల వల్ల రోడ్లు గుల్లై ఇళ్లలోకి దుమ్ము చేరుతుండడంతో మహిళలు, యువకులు, స్థానికులు రోడ్ల పైకి వచ్చి లారీలను అడ్డుకుంటూ ధర్నాలు చేస్తున్నారు. నిత్యం వందలాది ఓవర్ లోడ్ టిప్పర్లు అతివేగంగా తిరుగుతుండడంతో పిల్లలు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు.



## గుంతలమయంగా మారిన రోడ్లు...

నిరంతరం ఓవర్ లోడ్ టిప్పర్లు తిరగడం వల్ల రోడ్లు ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలు తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. అభివృద్ధి లేక పల్లెలు అల్లాడుతూ రవాణా మైనింగ్ నిబంధనల ప్రకారం క్వారీల ద్వారా వచ్చే రాయల్టీలు గ్రామీణ ప్రాంతాలకు దక్కాల్సిన వాటా సొమ్ము కాగితాలకే పరిమితం అవుతుంది. ఖనిజ తవ్వకాలు జరిగే ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించవలసిన డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ నిధులు ఆయా గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పర్యావరణ పరిరక్షణ పనులకు ఖర్చు కావడం లేదు అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ పట్టించుకోవాలని చుట్టుపక్కల గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## నిత్యం వందలాది టిప్పర్లు...

మాదారం పరిసర ప్రాంతాల క్వారీల నుండి కిష్టారెడ్డిపేట ఓఆర్ఆర్ వైపు రోజూ వందలాది టిప్పర్లు ఓవర్ లోడ్ తో తిరుగుతుండడంతో ప్రయాణికులు స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కనుచూపు మేరలో దుమ్ము ధూళి, కంకర రాళ్లు, డస్ట్ తో వెళ్లే లారీలకు కవర్లు, తార్పాలిన్లు కప్పకపోవడంతో గాలికి విపరీతమైన దుమ్ము లేచి వెనక వచ్చే వాహనదారులకు రోడ్డు అసలు కనిపించడం లేదంటూ నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ఓవర్ స్పీడ్ ట్రిప్పుల కోసం రేసింగ్ డ్రైవర్లు ఎక్కువ ట్రిప్పులు వేస్తే వచ్చే కమిషన్ ఆశతో వాహనాలను పరిమితికి మించి అతివేగంగా తోలుతున్నారు.



## ఇండ్లకు బీటలువారుతున్నాయి : పెద్ద మల్లేష్, దువ్వగుంట గ్రామస్తుడు



భారీ శబ్దాల పేలుళ్ల వల్ల సమీపంలో ఉన్న ఇల్లు భవనాలు కంపించిపోయి గోడలకు బీటలు, పగుళ్లు పడే పరిస్థితి ఏర్పడింది. నిత్యం భయందోలనవల్ల కాలం వెళ్లదీస్తున్నాం. గర్భిణీలకు తీవ్ర నష్టం కలుగుతుంది. భారీ శబ్దాలతో జరుగుతున్న పేలుళ్ల దాటికి తీవ్ర భయాందోళనలు, ఒత్తిడికి గురై గర్భవతుల పిండాలను కోల్పోయే తీవ్ర విషాద పరిస్థితులు నెలకొంటున్నాయి. భూమి అంతటా వచ్చే తీవ్ర ప్రకంపనల వైబ్రేషన్ కారణంగా పొలాల్లో ఉన్న బోరుబావులు పూడిపోయి లోపలికి కేసింగ్ పైపులు నలిగిపోయి కూలిపోతున్నాయి. ఓవైపు భూగర్భ జలాలు ఇంకిపోవడం మరోవైపు పంట పొలాలు నాశనం అవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు ఇచ్చినా ఫలితం శూన్యం.





# అజయ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# రాక్ బాల్ పోటీలు

- అజయ్ ఫౌండేషన్ చైర్మన్ మురళి యాదవ్
- నేటి యువత క్రీడలలో రాణించాలి
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**16 రాష్ట్రాలు 54 జట్లు పాల్గొన్నాయి**







నర్సాపూర్ సెప్టెంబర్ 6 (సిరి న్యూస్) శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరం యువతలో క్రీడలను ప్రోత్సహిస్తే గ్రామీణ స్థాయిలో భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగడానికి పోటీలు అవసరం అజయ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10th సీనియర్ నేషనల్ అండ్ 7th సీనియర్ మిక్స్డ్ నేషనల్ రాక్ బాల్ ఛాంపియన్షిప్ తెలంగాణ రాష్ట్ర అమెష్యూర్ రాక్ బాల్ పర్యవేక్షణలో ఆదివారం బి.వి.ఆర్ ఐటి కళాశాలలో రాష్ట్రస్థాయి రాక్ బాల్ పోటీలు నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి ,ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అజయ్ ట్రస్ట్ చైర్మన్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళి యాదవ్ ఈ పోటీలను ప్రారంభించారు ఈ పోటీలలో 16 రాష్ట్రాలను 54 జట్లలలో 52 మిక్సడ్ 3 సింగిల్స్ జట్లు పాల్గొంటున్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుందని భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అన్నారు ఓడిన జట్లు బాధతో ఉండకూడదని తర్వాత మ్యాచ్ లలో గెలిపే లక్ష్యంగా ముందుకు పోవాలని అన్నారు క్రీడలలో గెలుపు ఓటములు సహజమని అన్నారు,



బిజెపి రాష్ట్ర వర్గ సభ్యుడు,అజయ్ ట్రస్ట్ చైర్మన్ మురళి యాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో అజయ్ ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేశాము అందు లో భాగంగానే నేటి యువతలో మానసికంగా ఉల్లాసంతో పాటు శారీరకంగా ఉల్లాసం కల్పించాలని గతం లో జూనియర్ క్రీడలు నిర్వహించా ము ప్రస్తుతం సీనియర్ క్రీడాకారులతో రాక్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నాము
నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాలు సరిగ్గా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలలో యువత క్రీడ లకు దూరంగా ఉంటున్నారు స్మార్ట్ ఫోన్ లతో గేమ్ తో ఆడుకుం టూ ఉంటున్నారు యువత క్రీడలలో ప్రోత్సాహం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది అన్నారు అదే ఫౌండేషన్ ద్వారా మరెన్నో కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ పోటీలకు బివిఆర్ఐటి కళాశాల యాజమాన్యం సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రాక్ బాల్ ప్రెసిడెంట్ శివకుమార్ ఆల్ ఇండియా రాక్ బాల్ జనరల్ సెక్రెటరీ భూపేందర్ సాగువన్ నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ భూచేష్ యాదవ్ కౌన్సిలర్లు బిజెపి రాష్ట్ర నాయకుడు రఘువీరారెడ్డి సినీ పత్రిక సీఈవో శివశంకర్ నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.



